క్లుప్తంగా

నున్నలో విద్యుత్ శాఖ తనిఖీలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో శనివారం విద్యుత్ తనిఖీలు నిర్వహించారు. ఈఈ పి.హరిబాబు ఆధ్వర్యంలో 38 జట్లుగా విడిపోయి ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. 3,800 సర్వీసులను తనిఖీ చేసి అదనపు లోడు కింద విద్యుత్ వినియోగించిన వారిని గుర్తించి రూ.3.40 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు మాట్లాడుతూ అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈలు నవీన్, బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా కాశీ విశ్వేశ్వరుని శాంతి కల్యాణం

గన్నవరంరూరల్: మండలంలోని బీబీగూడెం గ్రామంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శాంతి కల్యాణం శనివారం కనులపండువగా జరిగింది. వైశాఖ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సామల ఆంజనేయులు, జయలక్ష్మి, సామల సుబ్బారావు, జ్యోతి దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణం నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి ఎంతో విశిష్టమైనదని, ఈ రోజు పేదలకు దానం చేస్తే జన్మాంతర పాపాలు తొలగిపోయి అష్టైశ్వర్యాలు కలుగుతాయని వేద పండితులు భక్తులకు ఉపదేశించారు. గ్రామానికి చెందిన మహిళా భక్తులు విశేషంగా ఈ కల్యాణంలో పాల్గొని స్వామివారిని దర్శించారు.

డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జయసూర్య



గన్నవరం: గన్నవరం సబ్ డివిజన్ డీఎస్పీగా ఆర్‌జీ జయసూర్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా సీఐడీ విభాగంలో పనిచేస్తున్న ఆయన్ను గన్నవరం సబ్ డివిజన్‌కు బదిలీ చేశారు. స్థానిక రాయ్‌నగర్ కాలనీలోని సబ్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

సెల్‌టవర్ బ్యాటరీలు చోరీ

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో సెల్‌టవర్ బ్యాటరీలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాకలో రిలయన్స్ సెల్‌టవర్‌కు ఏర్పాటు చేసిన బ్యాటరీలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బ్యాటరీల విలువ రూ. 30 వేలు ఉంటుందని కంపెనీ ప్రతినిధి గుండిమెడ తెలిపారు. ఈ మేరకు రామచంద్రరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రారంభానికి సిద్ధమవుతున్న రైతుభరోసా కేంద్రం



తుది దశకు చేరిన పునాదిపాడు-2 సచివాలయ భవనం

శరవేగంగా సొంత భవనాలు

- రూ. 1.01 కోట్ల అంచనాలతో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు
- పునాదిపాడులో చురుగ్గా సాగుతున్న పనులు
- ప్రారంభానికి సిద్ధమవుతున్న ఆర్‌బీకే, సచివాలయ భవనాలు
- తుది దశలో వెల్‌నెస్‌సెంటర్, బీఎంసీ



తుది దశకొచ్చిన వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణం



శరవేగంగా బీఎంసీ భవన నిర్మాణ పనులు

కంకిపాడు: ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు సమకూరనున్నాయి. పాలన క్షేత్రస్థాయికి తీసుకొచ్చిన ప్రభుత్వం ఆయా శాఖలకు కార్యాలయాలను నమకూర్చేందుకు అవసరమైన నిధులను కేటాయిస్తోంది. భవనాలు సమకూరుతుండటంతో మెరుగైన సేవలు అందుతాయని ప్రజలు ఆనందంగా ఉన్నారు.

రూ 1.01 కోట్లతో నిర్మాణ పనులు..

మేజర్ పంచాయతీల్లో ఒకటైన పునాదిపాడు గ్రామంలో రెండు సచివాలయాలను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. పునాదిపాడు-1 సచివాలయాన్ని ఇది వరకే నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు సమర్థంగా అందుతున్నాయి. దాని పరిధిలో రూ. 21.80 లక్షల అంచనా వ్యయంతో రైతుభరోసా కేంద్రం, రూ 17.50 లక్షల అంచనా వ్యయంతో వెల్‌నెస్ సెంటర్, రూ. 22 లక్షల అంచనాతో బల్క్ మిల్క్ సెంటర్(బీఎంసీ) నిర్మాణ పనులను చేపట్టారు. ప్రస్తుతం రైతుభరోసాకేంద్రం ప్రారంభానికి సిద్ధమవుతోంది. వెల్‌నెస్ సెంటర్ పనులు తుదిదశలో ఉన్నాయి. పాల సేకరణకు నిర్మిస్తున్న భవనం పనులు శరవేగంగా సాగుతున్నాయి. పునాదిపాడు-2 సచివాలయం పరిధిలో సచివాలయానికి భవనం నిర్మించేందుకు పునాదిపాడు-కోలవెన్ను రోడ్డులోని సామాజిక స్థలాన్ని గుర్తించారు. ఆ స్థలంలో రూ. 40 లక్షల అంచనా వ్యయంతో సచివాలయ నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుతం భవనం నిర్మాణం దాదాపుగా పూర్తయ్యింది. త్వరలో సచివాలయాన్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

సమర్థంగా పౌర సేవలు..

సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోంది. ఆ లక్ష్యానికి అనుగుణంగా గ్రామస్థాయిలో అన్ని శాఖలకూ భవనాలను సమకూర్చి అవసరమైన సిబ్బందిని నియమించి సమర్థంగా పౌర సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటివరకూ ఇరుకు గదుల్లో, పంచాయతీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఆయా విభాగాలు అన్ని సౌకర్యాలతో కూడిన భవనాల్లోకి త్వరలో రాబోతున్నాయి. దీంతో సేవలు మరింత విస్తృతంగా అందనున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతూ, సేవలు అందుబాటులోకి రానుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో భవనాలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని సర్పంచ్ ముసిబోయిన విజయకుమారి తెలిపారు.

అధికారుల తీరుపై ఎంపీపీ నగేష్ ఆగ్రహం



ధాన్యం కొనుగోళ్లపై ఎంపీపీ నగేష్ అడిగిన ప్రశ్నలకు బదులిస్తున్న ఏవో భవాని

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో లాంఛనంగా ప్రారంభించేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులతో అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉందని బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మహాత్మగాంధీ నగర్‌లోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం మీటింగ్ హాల్‌లో జరిగిన బాపులపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సహా పలువురు ఎంపీటీసీ సభ్యులు అధికారుల తీరుపై మండిపడ్డారు. ఇటీవల జరిగిన ఫ్యామిలీ డాక్టర్, 104 సర్వీస్ నూతన వాహనం ప్రారంభోత్సవానికి కనీసం ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు నిర్వహించటంపై బాపులపాడు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ నారయ్యను ఎంపీపీ నగేష్ నిలదీశారు. దీనిపై ఎంపీడీవో కె.ప్రభాకరరావు స్పందిస్తూ మండల, గ్రామస్థాయిలో నిర్వహించే ప్రతి ప్రభుత్వ కార్యక్రమానికి విధిగా స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని, తప్పనిసరిగా వారిని భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై పలువురు ఎంపీటీసీ సభ్యులు అడిగిన సందేహాలపై మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని బదులిచ్చారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొదలైన కొద్దిసేపటికే రెవెన్యూ శాఖ తరఫున హాజరైన డీటీ వెంకట రమణ వెళ్లిపోవటంతో ఆ తర్వాత సభ్యులు లేవనెత్తిన రెవెన్యూ సంబంధిత అంశాలపై జవాబు చెప్పే అధికారి లేకపోవటంపై ఎంపీపీ నగేష్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. డీటీకి నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగా భవాని, వైస్ ఎంపీపీ పండు రాణి, పంచాయతీ రాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు డి.జయరాజు, ఎ.శ్రీనివాసరావు, షకీల్ అహ్మద్, ఎంఈవో సక్సేనా రాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ పనుల పరిశీలన



అంబేడ్కర్ విగ్రహ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరులోని సాయి శిల్పా కేంద్రంలో రూపుదిద్దుకుంటున్న అంబేడ్కర్ కాంస్య విగ్రహం పనులను విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. విజయవాడలోని స్వరాజ్య మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన అంబేడ్కర్ స్మృతివనంలో ఏర్పాటు చేయనున్న 125 అడుగుల ఎత్తయిన అంబేడ్కర్ కాంస్య విగ్రహంలో ముఖ్య భాగాన్ని ఢిల్లీలో తయారు చేస్తుండగా, మరికొంత భాగాన్ని గత నాలుగు నెలలుగా బొమ్ములూరులోని సాయి శిల్పా కేంద్రంలో తయారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అంబేడ్కర్ కాంస్య విగ్రహ తయారీ పనుల నాణ్యతను శనివారం పరిశీలించారు. విగ్రహ తయారీలో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ఏ విధమైన పొరపాట్లు దొర్లకుండా పనులు చేయాలని ఆయన శిల్పులను ఆదేశించారు.

'పది' ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కంకిపాడు: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శనివారం విడుదలైన పరీక్ష ఫలితాలలో కంకిపాడు మండలంలో 538 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 282 మంది ఉత్తీర్ణత సాధించారు. మండల ఉత్తీర్ణత శాతం 52.42గా నమోదైంది. ప్రతిభ కబర్చిన విద్యార్థులను ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులను ఎంఈవో కనకమహాలక్ష్మి అభినందించారు.

పెనమలూరులో టాప్ లేపారు..

పెనమలూరు: పెనమలూరు మండలంలో ప్రభుత్వ పాఠశాల్లో చదివిన విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారు. ఎంఈవో కనకమహాలక్ష్మి శనివారం వివరాలు వెల్లడించారు. పెనమలూరు మండలంలో 2022-2023 విద్యా సంవత్సరంలో పదవ తరగతి 581 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. వీరిలో బాలురు 274 మంది, బాలికలు 307 మంది చొప్పున ఉన్నారు. అయితే పది ఫలితాల్లో బాలురు 143 మంది, బాలికలు 167 మంది పాస్ అయ్యారు. మండలంలో 54.40 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను,ఉపాధ్యాయులను ఎంఈవో కనకమహాలక్ష్మి, పాఠశాల కమిటీ అభినందించారు.

గన్నవరంలో 63.54 శాతం ఉత్తీర్ణత

గన్నవరం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గన్నవరం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 63.54 శాతం ఉత్తీర్ణతను సాధించారు. మొత్తం 1,119 విద్యార్థులకు గాను 711 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు 48.40 శాతం, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 83.37 శాతం, వీరపనేనిగూడెం గురుకుల పాఠశాల విద్యార్థులు 78.75 శాతం ఉత్తీర్ణులయ్యారు.

విజయవాడ రూరల్ మండలంలో 43 శాతం ఉత్తీర్ణత..

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలో పదో తరగతి పరీక్షలకు మొత్తం 712 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 310 మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో మండలంలో 43 శాతం ఉత్తీర్ణత సాధించినట్టయింది. నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 264 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 120 మంది కృతార్థులై 45 శాతం ఉత్తీర్ణత సాధించారు. రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 162 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 71 మంది ఉత్తీర్ణులై 44శాతం ఉత్తీర్ణత సాధించారు.

మానికొండ జెడ్పీ హైస్కూలు విద్యార్థుల ప్రతిభ..

ఉంగుటూరు: పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో మానికొండ జెడ్పీ హైస్కూల్‌లో 63 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో వెంకటేశ్వరరావు తెలిపారు.

బాపులపాడు మండలంలో 72 శాతం ఉత్తీర్ణత

హనుమాన్‌జంక్షన్ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో మండలంలో 72.18 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు బాపులపాడు ఎంఈవో సక్సేనా రాజు శనివారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన మొత్తం 737 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వీరిలో 532 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 10వ తరగతిలో 66 శాతం ఉత్తీర్ణత సాధించారని హెచ్‌ఎం ఎంపీ సుబ్బారావు శనివారం తెలిపారు. 94 మంది పరీక్షలకు హాజరు కాగా 62 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. మొత్తం 8 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారన్నారు.

టీడీపీ నేతపై చీటింగ్ కేసు

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలోని ఓ టీడీపీ నేతపై పోలీసులు శనివారం చీటింగ్ కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక శివాలయం సమీపంలో ఉంటున్న కొడాలి నాగలక్ష్మి, నరేంద్ర దంపతులు నివసిస్తున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ముసునూరి నిర్మల్‌కుమార్ తన లారీల వ్యాపారం నిమిత్తం 2015లో నాగలక్ష్మి వద్ద వడ్డీకి రూ. 5 లక్షలు అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు తిరిగి చెల్లించమని ఆమె కోరగా సొమ్ము ఇవ్వటంలేదు. పైగా నాగలక్ష్మిని బెదిరించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులు ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురు అరెస్టు

పెనమలూరు: కోడి పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి నారాయణపురం కాలనీ సమీపంలో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. వీరి దాడిలో కోనపరెడ్డి పవన్‌కుమార్, కె.కాసులు, ఎస్.శివప్రసాద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 2,100, రెండు పుంజులు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

మూడు చోరీ ఘటనలపై కేసు నమోదు

కంకిపాడు: కంకిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు ప్రాంతాల్లో జరిగిన చోరీ ఘటనలపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు శుక్రవారం రాత్రి ఉప్పులూరులోని సూపర్‌మార్కెట్ షట్టర్ తాళాలు దొంగలు పగులకొట్టి లోనికి ప్రవేశించి రూ. 5 వేల నగదు చోరీ చేశారు. అలాగే కంకిపాడు దుర్గా ఎస్టేట్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు రూ. 15 వేల నగదు, కోలవెన్ను శివారు మాదాసువారిపాలెంలోని ఆంజనేయ స్వామివారి దేవస్థానంలో హుండీ పగులకొట్టి నగదు చోరీకి చేశారు. ఆయా ఘటనల పై బాధితులు ఎలమంచిలి శోభన్‌బాబు, బండి నాంచారయ్య, కె.సురేష్ చోరీలపై పోలీసులకు ఫిర్యాదుల చేయటంతో కేసులు నమోదు చేశారు.

ఎంఈవో కార్యాలయానికి చేరిన నోట్‌బుక్స్

పెనమలూరు: మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన పథకం కింద నోట్ పుస్తకాలు ప్రభుత్వం సరఫరా చేసింది. మండల పరిధిలో 4,359 మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం కింద మొత్తం 35,194 నోట్ పుస్తకాలు శనివారం వచ్చాయి. వీటిని పాఠశాలలు తెరచిన తర్వాత ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తారు. అదే విధంగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు బెల్టులు కూడా వచ్చాయి. పాఠ్యపుస్తకాలు, యూనిఫారం, బూట్లు, బ్యాగులు కూడా త్వరలో ప్రభుత్వం నుంచి అందుతాయని ఎంఈవో కనకమహాలక్ష్మి తెలిపారు.

డీఎస్పీని కలిసిన పెనమలూరు పోలీసులు



పెనమలూరు: గన్నవరం సబ్‌డివిజన్ డీఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టిన జయసూర్యను పెనమలూరు పోలీసులు శనివారం కలిశారు. గన్నవరం సబ్‌డివిజన్‌కు గతంలో డీఎస్పీగా ఉన్న విజయ్‌పాల్ బదిలీపై వెళ్లిన తర్వాత డీఎస్పీగా జయసూర్యకు పోస్టింగ్ ఇచ్చారు. ఆయన శనివారం విధుల్లో చేరటంతో పెనమలూరు సీఐతో పాటు ఎస్ఐలు రాజేష్, ఉషారాణి, శేషకుమార్, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల వివరాలు డీఎస్పీ జయసూర్య అడిగి తెలుసుకున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

కంకిపాడు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కంకిపాడు పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కె. సుధాకర్ తెలిపిన కథనం మేరకు ఈడుపుగల్లు నుంచి ఉప్పులూరులోని ఒక ఇంటికి రేషన్ బియ్యం తరలించనట్లు సమాచారం అందటంతో ఆ ఇంటి పై పోలీసులు దాడులు నిర్వహించి రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 1,150 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోని ఇందుకు పాల్పడిన లాం ప్రవీణ్‌పై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు ఆర్థిక సాయం

పెనమలూరు: యనమలకుదురు ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ పేద ముస్లింలకు ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఇద్దరు యువకులకు వివాహం సందర్భంగా రూ 5వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. అదే విధంగా పూటగడవలేని ముస్లిం మహిళ మైమునాకు సరుకులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ ఫజలుల్‌హక్, షేక్ మౌలాలి, ఖుద్దుస్, అమీన్, అస్లాం, బుజ్జి పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపులు

కంకిపాడు: ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లా గ్రంథాలయ సంస్థ పర్యవేక్షణలో కంకిపాడు, తెన్నేరు శాఖ గ్రంథాలయాల్లో ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 16వ తేదీ వరకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రంథాలయాల అధికారులు సీహెచ్ రామకృష్ణ, ఎస్.సునీత శనివారం తెలిపారు. సమ్మర్ క్యాంపుల్లో భాగంగా కథలు చదివించటం, పుస్తక పఠనం, కథలు చెప్పటం, స్పోకెన్ ఇంగ్లిష్ పై విద్యార్థులకు శిక్షణ శిబిరాలు కొనసాగుతాయన్నారు.

రైతులకు యంత్రాలు పంపిణీ

పెనమలూరు: మండల పరిధిలో రెండు రైతు గ్రూపులకు ప్రభుత్వం వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద యంత్రాలు శనివారం పంపిణీ చేశారు. ఈ మేరకు మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ మాట్లాడుతూ వణుకూరులో అన్నదాత రైతు సంఘానికి రూ. 1.20 లక్షల విలువ చేసే రోటోవేటర్ రూ. 38 వేల సబ్సిడీతో అందజేశామన్నారు. కానూరులో రైతుబంధు గ్రూప్‌నకు రూ 7,43,915 విలువ చేసే ట్రాక్టర్ ఇచ్చామని తెలిపారు. దీనిలో రైతులకు రూ. 2,97,566 సబ్సిడీ ఉందన్నారు. రైతు గ్రూపులకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద సబ్సిడీపై యంత్రాలు ఇచ్చి రైతులను ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొని ప్రభుత్వ సాయం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి

రామవరప్పాడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా సేల్స్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఎనికేపాడులోని హెచ్‌పీసీఎల్ రిటైల్ అరుణ ఫిల్లింగ్ స్టేషన్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఇంధన వినియోగం తగ్గిస్తే చాలావరకు వాయు కాలుష్యాన్ని, పర్యావరణాన్ని కాపాడినవారం అవుతామన్నారు. హెచ్‌పీసీఎల్ రిటైల్ రీజనల్ మేనేజర్ ఆనంద్ ఆదిత్య మాట్లాడుతూ చిన్న చిన్న అవసరాలకు సైకిళ్లను వినియోగించుకునేలా అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా భావితరాలకు భూమిలో ఇంధనం, వాయువులు ఉండేలా సంరక్షించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ చీఫ్ విల్సన్, మేనేజర్ మాగంటి రాంబాబు, డీలర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలో శనివారం ఆగిరిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. పాఠశాల 1993 బ్యాచ్ పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకుని సందడి చేశారు. పాఠశాలలో చదువుకునే రోజుల జ్ఞాపకాలను, గురువులతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు.